క్లుప్తంగా

కొత్తగా పాఠశాలలను ఏర్పాటు చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: నగరపాలకసంస్థ పరిధిలో విస్తరించిన ప్రాంతాల్లోని జనాభాకు అనుగుణంగా కొత్తగా పాఠశాలలను ఏర్పాటు చేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు చందోలు రవికుమార్, సీనియర్ నాయకుడు టి.శేషిరెడ్డి కోరారు. సోమవారం పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డికి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రవికుమార్ మాట్లాడుతూ పాఠశాలల విలీనం పేరుతో నగరపాలకసంస్థ పరిధిలో మూసివేసిన 25 పాఠశాలల స్థానంలో కొత్తగా పాఠశాలలను ఏర్పాటు చేయాలన్నారు. తూర్పు మండల పరిధిలో పరిపాలన సౌలభ్యం కోసం ఈస్ట్ ఎంఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అసెస్మెంట్ విధానాన్ని రద్దు చేసి, పాత విధానంలోనే పరీక్షలను ప్రశ్నపత్రం పద్ధతిలో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

గోళ్ల అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ల అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అరండల్‌పేటలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ నాయకులు పొలిమేర హరికృష్ణ, వేజేండ్ల సుబ్బారావు, రాంబాబు, వెంకటన్న, బుజ్జి, తిమోతి పాల్గొన్నారు.

సినీనటుడు శ్రీకాంత్ చిత్రపటం దహనం

లక్ష్మీపురం: మహాత్మగాంధీపై సోషల్ మీడియాలో అసభ్యకర, అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ వైఖరి ఇటీవల సోషల్ మీడియాలో విపరీత ధోరణికి దారి తీస్తోందని రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ కో ఆర్డినేటర్, జిల్లా అధ్యక్షులు కరీం అన్నారు. గుంటూరు నాజ్‌సెంటర్ వద్ద సోమవారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శ్రీకాంత్ అయ్యార్ నటించిన(ఆరి) అనే నూతన సినిమా విడుదల అయినా సందర్భంగా నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ పోస్టర్‌ను చింపేస్తూ చిత్ర పటానికి నల్లరంగు పూసి దహనం చేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

గుంటూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. పొత్తూరు చెరువుకట్ట సమీపంలో మురిపి సింగమ్మ(55) అనే వృద్ధురాలు జీవిస్తుండేది. ఆమె భర్త శ్రీనివాసరావు గతంలో మృతి చెందటంతో సింగమ్మ ఒంటిరిగానే ఉంటుంది. అదే గ్రామంలో తన కుమార్తె అల్లుడు ఉండేవారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి సింగమ్మ ఇంట్లో ఒంటరిగా మంచం పక్కనే పడి ఉండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. రెండు రోజుల క్రితం సింగమ్మ ఇంట్లో ఒక యువకుడు చోరీకి పాల్పడగా సింగమ్మ చూసి వాళ్ల అమ్మకు చెప్పటంతో వివాదం జరిగిందని, ఈ క్రమంలో చోరీకి పాల్పడిన యువకుడే అతడి మరో ఇద్దరు స్నేహితులతో కలిసి వృద్ధురాలిని హతమార్చి ఉండవచ్చని గ్రామంలో ప్రజల్లో చర్చాంశనీయంగా మారింది. ఇది హత్య, లేక ఆకస్మిక మరణమా అనేది పోస్ట్ మార్టం రిపోర్ట్‌లో తేలనుందని పోలీసులు తెలిపారు.

రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలి



గుంటూరు రూరల్: నగరంలో రోడ్లకు ఇరువైపులా, డివైడర్లలో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా ఆహ్లాదాన్ని అందించే మొక్కలను నాటాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం జేకేసీ కాలేజీ రోడ్, సమ్మర్‌పేట, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఈ సీజన్‌లో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా 5 లక్షల మొక్కలు నాటే లక్ష్యంగా వార్డుల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. నగరపాలక సంస్థ ఉద్యానవన అధికారులు ప్రధాన రోడ్లకు ఇరువైపులా, డివైడర్లలో మొక్కలను విరివిగా నాటాలన్నారు. ఇప్పటికే డివైడర్లలో ఉన్న మొక్కలను సంరక్షించడానికి శ్రద్ధ చూపాలని ఆదేశించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పోరాటం ఆగదు

- వైఎస్సార్ సీపీ నాయకులు వెల్లడి
- నగరంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమం ప్రారంభం



కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో సంతకాలు చేసి చూపుతున్న ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఏసురత్నం, విజయవాడ, గుంటూరు పార్లమెంటరీ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, పోతిన మహేష్, నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా

పట్నంబజారు: వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆధ్వర్యంలో.. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ.. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమం సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో సంతకాల సేకరణ కార్యక్రమానికి ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎంపీ, ఎన్టీఆర్, గుంటూరు పార్లమెంట్ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, పోతిన మహేష్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుతగా పార్టీ నేతలు సంతకాలు చేసి, పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలతో సంతకాలు చేయించారు. స్వచ్ఛందంగా ప్రజలు తరలివచ్చిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకరంగా సంతకాలు చేశారు.

రాష్ట్రంలో ప్రభుత్వం లేదనే భావన...

మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అసలు పాలన ఉందా.. లేదా అనే అనుమానం కలుగుతోందని చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి లేడనే భావనతోనే గవర్నర్‌కు సంతకాల సేకరణల ద్వారా లేఖలు రాస్తున్నామని వెల్లడించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకునివచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్‌లతోనే అనేక మంది ముస్లింలు డాక్టర్‌లు అయ్యారన్నారు. పేద వర్గాలకు విద్యా, వైద్యాన్ని దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని మండిపడ్డారు.

నకిలీ మద్యం ఆపకుంటే షాపులను ధ్వంసం చేస్తాం

పార్టీ గుంటూరు పార్లమెంట్ జిల్లా పరిశీలకులు పోతిన మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను చంద్రబాబు డబ్బున్న బడా బాబుల చేతిలో పెట్టాడని దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ నేతలు ఇళ్లల్లో అక్రమ మద్యం కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నారని విమర్శించారు. నకిలీ మద్యాన్ని ఆపకపోతే వైఎస్సార్ సీపీ మహిళా శ్రేణులు మద్యం షాపులను ధ్వంసం చేసేందుకు వెనుకాడబోరన్నారు. కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేట్ పరం చేసే దిశగా కూటమి చేస్తున్న కుట్రలను ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుంటామన్నారు. పేదలకు కనీసం మేలు చేయకుండా, వారి కోసం వైఎస్ జగనన్న నిర్మాణం చేసిన మెడికల్ కాలేజీలను అక్రమంగా అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజా వ్యతిరేకతో కూటమి కొట్టుకుపోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, యువజన విభాగం నగర అధ్యక్షుడు యేటి కోటేశ్వరరావు యాదవ్ పాల్గొన్నారు.

అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్, పక్కన మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌కు అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలని, ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీలను నిర్దేశిత గడువు మేరకు పరిష్కారం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో పీజీఆర్ఎస్‌లో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 28 ఫిర్యాదులు తీసుకున్నారు. పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. సోమవారం నిర్వహించే కార్యక్రమానికి క్షేత్ర స్థాయి అధికారులు హాజరైతే సమస్యల పరిష్కారం తేలికవుతుందని చెప్పారు. ప్రతి విభాగంలో పీజీఆర్ఎస్, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని కోరారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలన్నారు. పీజీఆర్ఎస్‌కు 47 అర్జీలు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 8, ఇంజినీరింగ్ విభాగానికి 18, రెవెన్యూ విభాగానికి 10, ప్రజారోగ్య విభాగానికి 6, ఉపా సెల్ విభాగానికి 4, అకౌంట్స్ విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటాలి

గుంటూరు నగరంలో రోడ్లకు ఇరువైపులా, డివైడర్లలో మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా ఆహ్లాదాన్ని అందించే మొక్కలను నాటాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఉద్యానవన విభాగ, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జేకేసీ కాలేజీ రోడ్, సమ్మర్ పేట, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ హెడ్ వాటర్ వర్క్స్ కార్మికులకు, నగరంలోని వాల్వ్ ఆపరేటర్లకు రెయిన్ కోట్‌లు, బూట్లు, మాస్కులు, గ్లౌజ్‌లు వంటి రక్షణ పరికరాలు ఇవ్వాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు విన్నవించారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులను కలిసి వినతిపత్రం అందజేశారు.

జీఎస్టీ తగ్గింపుతో పెరుగునున్న కొనుగోలు శక్తి



జీఎస్టీ తగ్గింపుకు సంబంధిచిన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుతం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయం ప్రజల కొనుగోలు శక్తి పెంచడానికి దోహదపడుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 'జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల భవిష్యత్ ఆరథిక ధోరణులు'' అంశంపై నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రత్యేక అధికారి చల్లా ఓబులేసు అధ్యక్షతన ఆర్థిక నిపుణులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, వ్యాపారవేత్తలతో సెమినార్ నిర్వహించారు. చార్టర్డ్ అకౌంటెంట్స్ రాష్ట్ర అధ్యక్షులు డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సాధారణ, మధ్య తరగతి వారికి నిత్యావసర వస్తువులపై జీఎస్టీ రద్దు ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీని క్షేత్ర స్థాయిలో పటిష్టంగా అమలు చేయడానికి అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, మేనేజర్ బాలాజి బాషా పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న వర్కర్లు

లక్ష్మీపురం: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పని చేసే శానిటేషన్ వర్కర్స్‌కు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాన్ని తక్షణమే చెల్లించాలని అధికారులకు విన్నవించారు. గుంటూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కళాశాలల స్వీపర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు లేకుండా స్కూల్ స్వీపర్స్ ఎలా జీవించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రతినెల 5వ తేదీ లోగా వేతనాలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. ఈ సందర్భంగా డెప్యూటీ డీఈఓ మాట్లాడుతూ ఐదు రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.అంజలి, రాజేశ్వరి పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ



స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న నరసింహారావు

గుంటూరు ఎడ్యుకేషన్: స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నట్లు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నరసింహారావు పేర్కొన్నారు. సోమవారం పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్షా భవన్‌లో మధ్యప్రదేశ్‌లోని స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ శిక్షణ కేంద్రంలో హిమాలయ వుడ్ బ్యాడ్జీ శిక్షణ పూర్తి చేసుకున్న గైడ్ కెప్టెన్‌లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ కర్ణాటకలోని రాష్ట్రస్థాయి శిక్షణ కేంద్రంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలోనూ పాల్గొన్న స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు విజయవంతం చేశారని అన్నారు. జాతీయస్థాయిలో హిమాలయ బ్యాడ్జీ పొందడం ద్వారా విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన నైపుణ్యాలను పొందేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులను జాతీయస్థాయిలో జరిగే రాజ్య పురస్కార్, రాష్ట్రపతి అవార్డు అందుకునే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. త్వరలో జరగనున్న జాతీయస్థాయి జంబోరీలో సైతం రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎస్ఓసీ పి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ఉమాదేవి పాల్గొన్నారు.

18న ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేష్, సైదులు, శ్రీనివాస్ తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): ఎల్ఐసీ మచిలీపట్నం డివిజన్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ 57వ మహాసభలు గుంటూరులోని ఎన్‌జీఓ కళ్యాణ మండపంలో ఈ నెల 18వ తేదీ నిర్వహించనున్నట్లు యూనియన్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్ తెలిపారు. ఈ మేరకు అరండల్‌పేటలోని ఎల్ఐసీ కార్యాలయంలో సోమవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాసభలకు ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని ఎల్ఐసీ కార్యాలయాల్లో పనిచేసే సుమారు 300 మంది ఉద్యోగులు, ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. మహాసభలను సౌత్ సెంట్రల్ జోన్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు పి.సతీష్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.సైదులు, శ్రీనివాస్, గోపాలకృష్ణ, మధుబాల, రాజశేఖర్, విజయ రాఘవ, వెంకట్రావు, రాజేంద్రప్రసాద్, ఉషాబాల, శ్రీదేవి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు వాయిస్ చక్కని వేదిక



నగరంపాలెం: ప్రతి ఒక్కరిలో గొప్ప స్వరం ఉందని, దాన్ని వెలికితీసేందుకు వాయిస్ ఒక చక్కని వేదిక అని వాసవి జాగృతి ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు డాక్టర్ వేణుగోపాల్ తిరివీధి అన్నారు. వాసవి జాగృతి ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కొత్తపేట పట్టణ ఫ్యాన్సీ, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో సోమవారం వర్క్‌షాప్ (వాయిస్ -25) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రెజెంటేషన్ స్కిల్స్, స్టేజ్ కాన్ఫిడెన్స్‌ను పెంపొందిస్తామని అన్నారు. వారిలో ధైర్యం, స్పష్టత, ఆత్మవిశ్వాసం బోధించడం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అనంతరం ఫ్యాకల్టీలకు పి.స్వప్న, రత్నశ్రీ శిక్షణ అందించి, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ సుంకు చంద్రశేఖర్, జుజ్జూరి శేషప్రభాకర్, రంగా రత్నశ్రీ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎరువులపై రాజకీయం



గుంటూరు: ఎరువుల పంపిణీ రాజకీయ రంగు పులుముకుంటుంది. కొందరు సచివాలయ ఉద్యోగులు కూటమి నాయకుల కనుసన్నల్లో పని చేస్తూ వారు చెప్పినట్లుగా తా అంటే తందానా అన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో స్థానికంగా సమస్యలు తలెత్తుతున్నాయి. వట్టిచెరుకూరు మండలం కోవెలమూడిలోని రైతు సేవ కేంద్రానికి మూడు రోజుల కిందట యూరియా స్టాక్ వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు సదరు రైతు సేవ కేంద్రం గోడౌన్ వద్దకు వెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రాధాన్య క్రమంలో ముందుగా వచ్చిన రైతులకు వచ్చినట్లు ఇవ్వకుండా, టీడీపీ నాయకులు చెప్పిన వాళ్లకు ఎరువుల స్లిప్పులు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. అంతేకాకుండా వచ్చిన రైతులను బయటనే నిలబెట్టి కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆర్ఎస్‌కే గోడౌన్ లోపలకు వెళ్లి షట్టర్లు దించుకున్నారు. కొంత సేపటికి వారికి అనుకూలమైన వారికే యూరియా స్లిప్పులు ఇచ్చి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేశారు. అనంతరం వసూలు చేసిన డబ్బును హార్టికల్చర్ అసిస్టెంట్‌కు అప్పజెప్పారు. కాగా అందరికీ ఒకేలా ఎరువులను పంపిణీ చేయకుండా, వారికి బాగా కావలసిన ఒకలా, వేరొకరికి ఇంకొకలా పంపిణీ చేశారు. ఇదే విషయాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు వీహెచ్ఏను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో సోమవారం వారు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. వీహెచ్ఏ ఎరువుల పంపిణీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఏకపక్షంగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు సరిపడినన్ని ఎరువులు ఇవ్వాలని కోరారు.

నవంబర్ 3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు

నెహ్రూనగర్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా నవంబరు 3 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి తెలిపారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థలో జరిగే పీజీఆర్ఎస్‌లో కమిషనర్ పులి శ్రీనివాసులకు సమ్మె నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థలు, పురపాలకశాఖలో రెండేళ్లుగా విధుల్లో ఉండి మరణించిన, పదవి విరమణ చేసిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను అవుట్ సోర్సింగ్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు పెండింగ్ బకాయిలు సత్వరమే విడుదల చేయాలని, 2023న నాటి ప్రభుత్వంలో జరిగిన మున్సిపల్ సమ్మె విరమణ ఒప్పందంలో భాగంగా వర్క్ ఆఫ్ నేచర్ బట్టి ప్రస్తుతం పని చేస్తున్న ఇంజినీరింగ్ ఆఫీస్ సిబ్బంది స్కూల్ స్వీపర్స్ వంటివారికి వేతనాలు పెంచి చెల్లింపులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోటేశ్వరావు, సద్గుణ రావు తిరుమల రావు, భరత్, పూర్ణచంద్రరావు శివప్రసాద్ నాయక్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నగర శివారు ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ రవీంద్ర

నెహ్రూనగర్: నగర శివారు ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. సోమవారం నగరంలోని 25వ డివిజన్ వీఐపీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కల్వర్ట్ నిర్మాణ పనులు తనిఖీ చేశారు. నగరంలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను త్వరితగతిన నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలన్నారు. నిర్మాణ సమయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం కావేరి నగర్‌లో మురుగు నీరు సరిగా పారుదల లేక స్థానికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సదరు ప్రాంతంలో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. పర్యటనలో కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈ కోటేశ్వర రావు, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

నిధి పోర్టల్ ద్వారా బిల్లుల చెల్లింపు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపు కోసం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బిల్లులను నిధి పోర్టల్‌లో ఈ నెల 16వ తేదీలోగా అప్‌లోడ్ చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం బిల్స్ నిధి పోర్టల్లో అప్ లోడ్ అంశంపై నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, వేణుగోపాల్, విష్ణు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మార్చిలో మాణిక్యరావు శతజయంతి ఉత్సవాలు



శత జయంతి ఉత్సవ పోస్టర్లు విడుదల చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు, మోజెస్

గుంటూరు ఎడ్యుకేషన్: అధ్యాపక ఉద్యమ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎంజే మాణిక్యరావు శత జయంతి ఉత్సవ సభను వచ్చే ఏడాది మార్చిలో గుంటూరులో నిర్వహించనున్నట్లు ఎంజే మాణిక్యరావు మెమోరియల్ కమిటీ అధ్యక్షుడు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. సాంబశివపేటలోని ఏసీ కళాశాలలో సోమవారం జరిగిన సమావేశంలో శత జయంతి పోస్టర్లు విడుదల చేశారు. కేఎస్ లక్ష్మణరావు మ్లాడుతూ ప్రభుత్వ విద్య కోసం, ఎయిడెడ్ విద్యాసంస్థల పరిరక్షణ కోసం మాణిక్యరావు కృషి చేశారన్నారు. సమాజంలో విద్యార్థులందరికీ విద్యలో సామాజిక న్యాయం ఉండాలని ఆయన తుదిశ్వాస వరకు కోరుకున్నారని వివరించారు. ఎంజే మాణిక్యరావు శత జయంతి సభలు రాష్ట్రమంతటా వివిధ ప్రాంతాల్లో జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే కావలి, చిలకలూరిపేట, అమరావతి ప్రాంతాల్లో శతజయంతి ఉత్సవ సభలు జరిగాయని త్వరలో చీరాల, ఏలూరు, ఖమ్మం, భీమవరం, కర్నూలులు జరగనున్నాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్, అధ్యాపకులు ఎం.విజయకుమార్, మహేష్, సోమయ్య శాస్త్రి, ఎం.కైలాష్‌నాథ్, ప్రమీల, ఎల్.వెంకటేశ్వరరావు, కేవీఎస్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఎమ్మెల్సీ అప్పిరెడ్డి అభినందన

గుంటూరు రూరల్: బాస్కెట్ బాల్ రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన మండలంలోని అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ఇంటర్ విద్యార్థిని దొడ్డా నేత్ర, తొమ్మిదో తరగతి విద్యార్థి చల్లా ఆకాశ్‌లను ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అభినందించారు. నగరంలోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో అంకిరెడ్డిపాలెంలో నిర్మించిన బాస్కెట్ బాల్ శిక్షణ కేంద్రంలో దాదాపు 80 మంది పైగా క్రీడాకారులు వివిధ కేటగిరీల్లో శిక్షణ పొందుతున్నారన్నారు. విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ ఒక చిన్న గ్రామంలో అత్యున్నత ప్రమాణాలతో బాస్కెట్ బాల్ క్రీడా ప్రాంగణాన్ని నిర్మించటం ద్వారా గ్రామీణ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ ఇచ్చే అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కళాశాల ఇన్‌చార్జి రామచంద్రరావు, ఫిజికల్ డైరెక్టర్ నాగిరెడ్డి, విశ్రాంత అధ్యాపకుడు వీర గంగాధరరెడ్డి పాల్గొన్నారు.

మెలియాయిడోసిస్ నిర్ధారణపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌జై ముఖోపాధ్యాయ

గుంటూరు మెడికల్: జిల్లాలో మూడు నెలలకు పైగా మరణాలకు కారణమవుతున్న మెలియాయిడోసిస్‌పై వైద్యులు, వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని రీజినల్ పబ్లిక్ ల్యాబ్‌లో సోమవారం నుంచి 15వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. మెలోడీయోసిస్ ఏవిధంగా గుర్తించాలనే విషయాలపై తాడేపల్లి మణిపాల్‌కు చెందిన డాక్టర్ కిరణ్‌జై ముఖోపాధ్యాయ, టీమ్ సభ్యులు వివరించారు. తొలుత శిక్షణలో భాగంగా వైద్యులు, వైద్య సిబ్బందిని తురకపాలెం గ్రామానికి తీసుకెళ్లి వ్యాధి కారణమైన బ్యాక్టీరియా వైరస్‌ను ఏవిధంగా గుర్తించాలనే విషయాలపై వివరించి గ్రామంలో శాంపిల్స్ సేకరించారు. వాటిని వైద్య కళాశాలలోని రీజనల్ ల్యాబ్‌కు తీసుకొచ్చి శాంపిల్స్ ద్వారా ఏవిధంగా వ్యాధి కారక బ్యాక్టీరియాను గుర్తించాలనే విషయాలను స్లైడ్‌ల ద్వారా వివరించారు. శిక్షణ తరగతుల్లో ల్యాబ్ ఇన్‌చార్జి, మెడికల్ అండ్ హెల్త్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ జి.శోభారాణి, డాక్టర్ సుబ్రహ్మణేశ్వరి, డాక్టర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

క్యాష్ కొడితే చాలు.. ఖాళీ స్థలాలు శుభ్రం



నెహ్రూనగర్: నగపాలక సంస్థ పరిధిలో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా వర్షపు నీటితో నిండిపోయి అధ్వానంగా మారాయి. దీనిపై అధికారులకు ఫిర్యాదులు రావడంతో ఖాళీ స్థలాలు శుభ్రం చేయించుకోవాలని నోటీసులు జారీ చేస్తున్నారు. కాని కొంత మంది సిబ్బంది డబ్బులకు కక్కుర్తి పడి నగరపాలక సంస్థకు చెందిన వెహికల్స్ ద్వారా ఖాళీ స్థలాల్లోని వర్షం నీటిని తొలగిస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో ఇలాంటి వారి దందా అధికమైందని నగర వాసులు అభిప్రాయపడుతున్నారు.